

బచ్చుగూడం పల్లె ప్రకృతి వనంలో చెట్లకు ట్యాంకర్లతో నీరు పోస్తున్న కూలీలు

## ప్రకృతి వనంలో సంరక్షణ చర్యలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పటాన్‌చెరు, ఏప్రిల్ 26: హరితహారంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లుకు సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎండిపోతున్నాయని 'నమస్తే తెలంగాణ'లో నాడు పచ్చదనం...నేడు కళావిహీనం..అనే వార్త ఈనెల 25న ప్రచురితమైంది. పటాన్‌చెరు మండలంలోని బచ్చుగూడంలో బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న చెట్లు దెబ్బతింటున్న పర్యావరణ పరిరక్షణ లక్ష్యం అనే వార్త రావడంతో కలెక్టర్ స్పందించి వెంటనే పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లకు సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బచ్చుగూడెం పంచాయతీ కార్యదర్శి నరేశ్ శనివారం పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లుకు సంరక్షణ చర్యలు చేపట్టారు. ట్యాంకరు ద్వారా నీటిని తీసుకొచ్చి చెట్లకు పోశారు. చెట్లు మధ్య ఉన్న చెత్తను కూలీలతో తొలిగించారు. చెట్ల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో చర్యలు తీసుకున్నారు. ఎండిపోతున్న చెట్లను కాపాడేందుకు నమస్తే తెలంగాణ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



వీరన్నగూడెంలో కురుస్తున్న వర్షం

## ఉరుములు మెరుపులతో భారీ వర్షం

గుమ్మడిదల, ఏప్రిల్ 26: మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో భారీవర్షం పడింది. శనివారం మండలంలోని వీరన్నగూడెం, బొంతపల్లి, అన్నారం, దోమడుగు, గుమ్మడిదల తదితర గ్రామాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడింది. అకాల వర్షంతో మామిడి రైతులకు, వరి పంటలు సాగు చేసుకున్న రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఎండలు దంచికొడుతుండడంతో ఒక్కసారిగా వాన రావడంతో వాతావరణం చల్లబడింది.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్, ఏప్రిల్ 26:ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌యాప్‌లు, సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని న్యాల్‌కల్ మండలం హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ సూచించారు. శనివారం న్యాల్‌కల్‌లో ప్రజలు, యువకులు, మహిళలు, ఆటోడ్రైవర్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్‌నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. బ్యాంకు లోన్లు ఇస్తామని చెబితే నమ్మి మోసపోవద్దని సూచించారు. ఐపీఎల్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యాజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థినులు, యువతులు, మహిళలకు వేధింపులకు గురిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

జహీరాబాద్, ఏప్రిల్ 26: ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండోర్యాంకు సాధించిన విద్యార్థులను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోతికే, బుర్థిపాడ్, ఆల్గోల్ గ్రామ శివారులోని తెలంగాణ బాలికల, మైనార్టీ గురుకుల కళాశాలలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించినందుకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవి మంచిపేరు తెచ్చుకోవాలని విద్యార్థులను సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, మోహిజోద్దీన్, విజయ్‌కుమార్, తులసీదాస్‌గుప్తా, జాఫర్ అలీ, గురుకుల కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

రాయికోడ్, ఏప్రిల్ 26: రాయికోడ్‌లో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని రాయికోడ్ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ మంజులా రాణి తెలిపారు. శనివారం ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ....6వ తరగతిలో 117 మంది, 7వ తరగతిలో 26 మంది, 8వ తరగతిలో 29 మంది, 9వ తరగతిలో 16 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. విద్యార్థులు ఉదయం 9 గంటలలోగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో పరీక్ష నిర్వహణ అధికారి ఖైరాత్ అలీ, సిబ్బంది ఉన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబాయి

## అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

జిన్నారం, ఏప్రిల్ 26: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మబస్తీ తొమ్మిదో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబాయి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న ఐదేండ్లలోపు పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే గ్రాడ్యుయేషన్ డే ప్రాముఖ్యత అని వివరించారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు గ్రేడ్లు ప్రకటించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్లేస్కూల్ విద్యను మరింత బలోపేతం చేయాలని టీచర్లకు సూచించారు. తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు ప్రసన్న, భూలక్ష్మి, ఆయాలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఊరూవాడా..ఓరుగల్లుకు..



గుమ్మడిదలలో పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి



సదాశివపేట: వెల్టూర్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



హత్నూరలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కొండాపూర్, ఏప్రిల్ 26: రజతోత్సవ సభను సక్సెస్ చేసేందుకు ఊరూవాడా కదలిరావాలని కొండాపూర్ బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీల నుంచి భారీగా తరలివెళ్లేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నాడు. తెలంగాణ ప్రజలు మురిసిపోయేలా రజతోత్సవ సభ నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి గులాబీ జెండానే శ్రీరామ రక్ష అని ప్రజలు పేర్కొంటున్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్లపాటు రాష్ట్రాభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోయిందని, పార్టీ కోసం పని చేసిన ప్రతిఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. రజతోత్సవ సభకు కొండాపూర్ మండలంలో కొన్ని రోజులుగా పోస్టర్లు అంటించే కార్యక్రమంలో ప్రతి కార్యకర్త బిజీగా ఉన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, తెలంగాణకు మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్‌ను ప్రజలు కోరుకుంటున్నారని నాయకులు తెలిపారు.

**దండులా కదులుదాం**

గుమ్మడిదల, ఏప్రిల్ 26: వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ 25 వసంతాల రజతోత్సవాలకు గులాబీదళం దండులా కదలాలని రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుమ్మడిదలలో మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లు గ్రామాలకు పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన పార్టీ రాష్ట్ర సాధన అనంతరం రాష్ట్ర అభివృద్ధికి పదేండ్లపాటు బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాలు ఒక వేడుక మాత్రమే కాకుండా పార్టీ బలోపేతానికి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడానికి వేడుకగా మారనుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే కాకుండా భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో నిర్ణయం తీసుకునే వేదికకానుందన్నారు. 25 వసంతాల వేడకకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లి బీఆర్ఎస్ సత్తా ఏంటో పాలకవర్గానికి తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల వరకు బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి మండలకేంద్రంలో భారీసంఖ్యలో బీఆర్ఎస్ జెండాను ఉదయం 10.30గంటలకు ఎగురవేయడానికి హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, దాసరి ఆంజనేయులు, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, డీ శంకర్, మంద భాస్కర్‌రెడ్డి, రుక్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్, అమ్మన్నగారి శేఖర్, వీరయ్యయాదవ్, ఆకుల సత్యనారాయణ, దర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రజతోత్సవ సభను విజయవంతం చేయాలి**

ఝురాసంగం, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ నిర్వహించే ఓరుగల్లు రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు షేక్ సోహెల్ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున సభకు తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోసం యువత, రైతన్నలు, గులాబీ సైనికులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మండలాధ్యక్షుడు వెంకటేశం నేతృత్వంలో ఝురాసంగం మండలం నుంచి పెద్ద ఎత్తున సభకు తరలిరావాలన్నారు. స్వరాష్ట్రం కోసం పుట్టిన జెండా గులాబీ జెండా, మన జెండా, మన కేసీఆ, మన రాష్ట్రం అన్నారన్నారు.

**బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ**

సదాశివపేట, ఏప్రిల్ 26: మండలంలోని వెల్టూర్‌లో బీఆర్ఎస్ జెండాను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెల్టూర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సయ్యద్ మొహిద్దిన్ చోటు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సభను తరలిరావాలి..బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ**

అమీన్‌పూర్, ఏప్రిల్ 26: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అమీన్‌పూర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బాసెట్టి కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రసంగం వినాలనే ఉత్సహంతో ప్రజలు ఉన్నారన్నారు. అందుకు ప్రజలంత స్వచ్ఛందంగా సభకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలంత తరలివెళ్లి సభకు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.

**ఉత్సాహంగా వరంగల్ సభకు...**

నారాయణఖేడ్, ఏప్రిల్ 26: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభకు నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలివెళ్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజల ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు 300 వాహనాల్లో దాదాపు 5,500 మందికిపైగా సభకు తరలి రానున్నారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ శ్రేణులు అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి సభకు బయలుదేరి రావాలని సూచించారు.

**ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష**

అందోల్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం అన్నారు. శనివారం జోగిపేటలో ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలి వెళ్లనున్నామన్నారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివస్తున్నారని ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వరంగల్ సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభంకానున్నదన్నారు. అమలు కానీ హామిలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమై రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందని విమర్శించారు. ప్రజలందరు మళ్లీ కేసీఆర్ రాకను కోరుతున్నారని, ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

**ఉరూవాడా కదలిరావాలి**

హత్నూర, ఏప్రిల్ 26: రజతోత్సవ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీసంఖ్యలో తరలిరావాలని మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దౌల్తాబాద్‌లో తెలంగాణతల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం బహిరంగ సభకు తరలివెల్దామన్నారు. నాయకులు సమయానికి దౌల్తాబాద్ చేరుకోవాలన్నారు. శనివారం పలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించారు.



రాజ్‌కుమార్‌కు గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపాల్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరికలు

కంగ్టి, ఏప్రిల్ 26: కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి చెందిన సోలంకర్ రాజ్‌కుమార్ శనివారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రాజ్‌కుమార్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తడ్కల్ మండల సాధన సమితి సభ్యుడిగా క్రియాశీలకంగా ఉన్న రాజ్‌కుమార్ గతంలో మండల సాధన కోసం నిరవధిక దీక్ష చేపట్టారు. అప్పట్లో బీఆర్ఎస్ తడ్కల్ మండల ఏర్పాటుకు జీవో విడుదల చేయడంతో దీక్షను విరమించారు. ప్రస్తుత ప్రభుత్వం తడ్కల్ మండల ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్యామ్‌రావుపాటిల్, వెంకటేశం, నర్సింహులు యాదవ్, బాలాజీ పాటిల్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి...**

హత్నూర, ఏప్రిల్ 26: మండలంలోని కొన్యాల గ్రామానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో చేసిన అభివృద్ధి, నిబద్ధత గల సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్ తదితర నాయకులు పాల్గొన్నారు.



జహీరాబాద్ దవాఖానలో వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జహీరాబాద్, ఏప్రిల్ 26: దవాఖానకు వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట వైద్యాధికారులు, లీగల్ సెల్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఉన్నారు.




అమీన్‌పూర్, ఏప్రిల్ 26: పహల్గాంలో జరిగిన ఘటనకు నిరసనగా శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, గోపాల్‌రెడ్డి, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోహీర్, ఏప్రిల్ 26:మండలంలోని మద్రిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. శనివారం ఉపాధిహామీ నిధుల కింద ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కేటాయించిన రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు కేటాయించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రమేశ్, ఖాలిద్‌మియా, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, దత్తు, మజర్, మల్లేశ్, మొగులమ్మ, రాజు, అన్వర్, తదితరులున్నారు.

## పెండ్లికి సహాయం

కోహీర్, ఏప్రిల్26: మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన నిరుపేద యువతి వివాహానికి సజ్జాపూర్ వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి రూ.పది వేలు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన ఆయిషా పెండ్లికి ప్రసాద్‌రెడ్డి తరపున కేపీఆర్ సంస్థ సభ్యులు ఆర్థికసాయం చేశారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

**ఆడపిల్లల తల్లులకు సన్మానం**

హత్నూర, ఏప్రిల్ 26: మండలంలోని నస్తీపూర్‌లో శనివారం ఆడపిల్లల తల్లులకు వెలుగు గ్రామైఖ్యసంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. తల్లి,పిల్లలకు నూతన వస్త్రాలతోపాటు పిల్లల పేర్లమీద సుకన్య సమృద్ధి యోజన పథకంలో ఒక్కో అమ్మాయికి వెయ్యి రూపాయల చొప్పున జమచేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామంలో ఆడపిల్ల పుడితే పండుగలా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసంఘం అధ్యక్షురాలు సువర్ణ, సీసీ కల్పన, వీవోఏ ప్రవీణ్‌తోపాటు మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## హిందూ సంఘాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సదాశివపేట, ఏప్రిల్ 26: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శనివారం పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.కేంద్రం హిందువులకు భరోసా కల్పిస్తూ దాడికి పాల్పడిన వారినిగా శిక్షించాలన్నారు.

**గుమ్మడిదలలో కాగడాల ర్యాలీ**

గుమ్మడిదల, ఏప్రిల్ 26: పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రవాద చర్యకు నిరసనగా మండల కేంద్రంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షపార్టీల నాయకులు, హిందు సంఘాలు పాల్గొన్నాయి.



అమీన్‌పూర్‌లో సర్వే నంబర్ 993 స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## ప్రభుత్వ స్థలం పరిశీలన


అమీన్‌పూర్ ఏప్రిల్ 26: అమీన్‌పూర్‌లోని సర్వేనెంబర్ 993లోని ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించి పరిశీలించారు. ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు విద్యాసంస్థలకు ఏర్పాటు చేసే దిశగా స్థలాన్ని కేటాయించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగానే కలెక్టర్ వలూరు క్రాంతి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి తహసీల్దార్ రామస్వామి, కమిషనర్ జ్యోతిరెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పవన్, ఇన్‌స్పెక్టర్లు రఘునాథ్‌రెడ్డి, శ్రీమాన్ రాజు ఉన్నారు.



విద్యార్థి రాహుల్‌నాయక్‌ను సన్మానించి, బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

నారాయణఖేడ్, ఏప్రిల్ 26: నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ప్రథమర్యాంకు సాధించిన నారాయణఖేడ్ మండలం పలుగుతండాకు చెందిన రాహుల్‌నాయక్, రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించిన నారాయణఖేడ్‌కు చెందిన బహిజ సబా, అక్షయ రాథోడ్‌లను సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో తెచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

### మా భూసమస్యే పరిష్కారం కావడం లేదు..

## సామాన్యుల పరిస్థితి ఏంటి?

రామచంద్రాపురం,ఏప్రిల్ 26: మా భూసమస్యే పరిష్కారం కావడం లేదు.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి అంటూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎదుటే ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన కార్పొరేటర్ పుష్పానగేశ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు మండలం బంగారుగడ్డలో భూసమస్య ఉన్నదని, ఎన్నిసార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారమవుతలేదని కలెక్టర్ ఎదుట తన బాధను వ్యక్తపర్చారు. తమకే న్యాయం జరుగకుంటే సామాన్య రైతులకు, ప్రజలకు ఏమి న్యాయం జరుగుతుందని ఆమె ప్రశ్నించారు. ఇకమీదటైనా రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని ఆమె కోరారు.



పటాన్‌చెరులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

## భూ భారతిని ఉపయోగించుకోవాలి

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 26:భూభారతిని రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం పటాన్‌చెరులోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో భూభారతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతితో అధికార వికేంద్రీకరణ జరిగిందన్నారు. పారదర్శకత జవాబుదారీతనం పెంచడమే ఈ చట్టం ముఖ్యఉద్దేశం అన్నారు. రైతులకు, ప్రజలకు మేలు చేయడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఎంఈవో నాగేశ్వర్‌నాయక్, స్పెషల్ ఆఫీసర్ దేవుజా, ఏవో శివకుమార్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, శ్రీహరి, మాజీ సర్పంచ్‌లు గడ్డం శ్రీశైలం, సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, మీర్ మోహియొద్దీన్, అంజిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,ఆర్ఐ ఖాజా పాల్గొన్నారు.

**రెవెన్యూ పరిధిలోనే భూ సమస్యలు పరిష్కారం**

రామచంద్రాపురం, ఏప్రిల్ 26: రెవెన్యూ పరిధిలోనే భూ సమస్యలు పరిష్కరించేలా భూభారతి చట్టాన్ని రూపొందించామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో భూభారతిపై తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భూభారతి ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై రైతులకు, ప్రజాప్రతినిధులు, ఇతరవర్గాల వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, శ్యామ్‌రావు, నగేశ్, ఈశ్వర్‌సింగ్, జయప్రకాశ్, ఇంద్రారెడ్డి, ఉప తహసీల్దార్ రవి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

**భూ భారతిపై రైతులకు అవగాహన**

అమీన్‌పూర్, ఏప్రిల్ 26: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై శనివారం అమీన్‌పూర్ బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో తహసీల్దార్ రామస్వామి అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై భూభారతిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి ఆర్ఐలు రఘునాథ్‌రెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



జేఎన్టీయూ వద్ద నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

## కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

చౌటకూర్, ఏప్రిల్ 26: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపడుతున్న సమ్మె ఏడోరోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జేఎన్టీయూ ప్రధాన ద్వారం వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఇందులోభాగంగా శనివారం మండుటెండలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉన్నత ఆశయంతో ఈ ఆందోళన కొనసాగుతుందన్నారు. న్యాయంగా బేసిక్ పే, డీఏ, మూడుశాతం, హెచ్‌ఆర్ఏ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కో ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మె చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్లుగా పీహెచ్‌డీలు, నెట్, సెట్ అర్హతలు కలిగి ఉంటూ ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిషత్తును నిర్మించే మేధావులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.



జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై కాల్వ పూడ్చివేసిన దృశ్యం

## సర్వీసు రోడ్డుపై కాల్వ పూడ్చివేత

చౌటకూర్, ఏప్రిల్ 26: చౌటకూర్ గ్రామంలోని కిందిబస్తీలో జాతీయ రహదారికి వెళ్లే సర్వీసు రోడ్డుకు అడ్డంగా తవ్విన కాల్వను ఎట్టకేలకు పూడ్చివేశారు. గ్రామంలోని మురుగు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు మూడు నెలల క్రితం సర్వీసు రోడ్డుకు అడ్డంగా కాల్వ తవ్వి వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి గ్రామంలో నిర్వహించిన భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు రాగా, స్థానికులు ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆమె కాల్వను పూడ్చి వేసి, మురుగు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ అనుదీప్, ఆర్డీవో పాండుకు సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు సంబంధిత ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సంప్రదించి కాల్వలో పైపులు ఏర్పాటయ్యేలా చూశారు. కలెక్టర్ ఆదేశాలతో మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్య ఎట్టకేలకు పరిష్కారం కావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



నల్లవల్లిలో దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు, మహిళలు

## మాగోడు సర్కారుకు పట్టదా..?

గుమ్మడిదల, ఏప్రిల్ 26: ప్యారానగర్ డంపింగ్‌యార్డు(ఎంఎస్ డబ్ల్యూ)తో మా బతుకులు ఆగమైతాయని 81 రోజులుగా డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ఇక్కడి గ్రామాల గోడును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ వెంటనే డంపింగ్ యార్డు ఏర్పాటును రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.